

# జ్ఞాపకాల జావళి

## - పొత్తూరి విజయలక్ష్మి



నా చిన్న తనం మా తాత గారిది కుగ్రామం .రెండు బ్రాహ్మణ వీధులు ..వూరి మధ్యన ఒకే ఆవరణలో విష్ణాలయం, శివాలయం, ఆంజనేయస్వామి ఆలయం. హైస్కూలు, ఎలిమెంటరీ స్కూలు, పోస్టాఫీసు అనబడే ఆత్మా రాముడు గారి వరండా. మరికాస్త లోపలికి వెళ్తే లైబ్రరీ మరియూ రామభజన మండపం. గుళ్ళకి ఎదురుగా గ్రామదేవత పుట్టలమ్మ ఆలయం. ఇంకాస్త అటుగా వెళ్తే మంచినీళ్ళ బావి అదీ దాటాక మల్లె తోటలూ ,జీడి మావిడి తోటలు, నారు మళ్ళూ , వరి పొలాలు, తాటి తోపులు, బిడారు దిబ్బలు అని పేరుపడ్డ పెద్ద ఇసుక దిబ్బలు. అవి దాటాక ఈ కుగ్రామాన్ని బాహ్య ప్రపంచంతో కలిపే తారు రోడ్డు ఇదీ ఆ గ్రామ స్వరూపం. వూరిపేరు యాజలి.

అందరూ కలిసి కట్టుగా వుండేవాళ్ళు. కులాల అంతరాలు అంతస్తుల తేడాలు ఉండేవికాదు. వూళ్ళో సుబ్బారావు కిరాణాకొట్టు , సామ్రాజ్యమ్మ కాఫీ హోటలు ఉండేవి . హోమియో డాక్టరు శేషగిరి రావు గారు ఇంగ్లీషు మందులిచ్చే కంపౌండర్‌గారు వుండేవారు. మేళం వాయించడానికి సుబ్బారాయుడు ఉండేవాడు. రెండు టైరు బళ్ళు, ఒక పల్లకి ఉండేవి. మంచినీళ్ళు పోసే భ్రమరాంబగారు వుండేది .రేడియో అక్కయ్య లాగా వూరందరికీ అక్కయ్యే ఆవిడ. ఆవిడకి ఓ చెల్లెలు సీతారావమ్మ. ఆవిడ భర్త సీతారామయ్య. వాళ్ళిద్దరూ వూరికి కొండంత అండ. ఏపని చెప్పినా కాదనకుండా చేసేవాళ్ళు నిజానికి పాపం వాళ్ళకి ఏ పన్లూరావు . ఊరిమీద ఆధారపడి బతుకుతున్నారు కాబట్టి కాదనకుండా వాళ్ళకి చాతయినట్లు చేసి పడేసేవాళ్ళు. ఆ తరవాత వారిదయ ఎదటివారి ప్రాప్తం. మంత్రాలు వేసి తాయెత్తులు కట్టే దిబ్బమీది బసవడు. మంత్రసాని మంగ వుండేవాళ్ళు . చాటింపు వేసే లక్ష్మడు. వీధి దీపాలు వెలిగించే దరియా వుండేవాళ్ళు. పౌరోహిత్యం చేయించే శాస్తుర్లుగారు, రంగయ్యగారూ వుండేవారు. ఇవీ స్థూలంగా ఆ వూరి మనుషుల వివరాలు. తెల్లవారుజామునే వూరు నిద్ర లేచేది . ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటూ పోయేవాళ్ళు. ఎక్కడ , ఎప్పుడు ఎవరు ఎదురైనా ఎన్నో ఏళ్ళ తరువాత కలుసుకున్నవాళ్ళలాగా కరువు తీరా కబుర్లు చెప్పుకునే వాళ్ళు. దాపరికాలు ఉండేవి కాదు. కష్టసుఖాలు ఒకరికొకరు పంచుకునేవాళ్ళు.

ఆ వూరికి కరణం మా తాతగారు. ఉప కరణం ఆయన తమ్ముడు. అనగా మాచిన్న తాతగారు. వూరి పెత్తనం అంతా వారిదే వారి మాట వేదవాక్కు..శిలాశాసనం వారు ఓ పని చెపితే అదీ సుగ్రీవాజ్ఞ. మా అమ్మమ్మ, చిన్న అమ్మమ్మ అధికారం లేక పోయినా బోలెడంత ప్రాముఖ్యం వున్న వాళ్ళు. పగలంతా పనులూ కాలక్షేపం. సాయంత్రం గూట్లో దీపం నోట్లో ముద్ద..అన్నట్లు పెందలాడే భోజనాలు ముగించేసి కాసేపు కబుర్లు. మాధవ కబళం వాళ్ళు వచ్చి మిగులు తగులు పట్టుకుపోవటంతో ఆవేళ్టి పనులు ముగిసినట్టే

ఇక అందరూ పక్కలు ఎక్కేవాళ్ళు. గడియారం ప్రకారం అప్పటికీ ఎనిమిది కూడా అయ్యేది కాదు. కబుర్లు చెప్పుకుంటూ నిదపోయేవాళ్ళు.

ఇళ్ళల్లో సామాన్లు కూడా మితంగానే ఉండేవి నవారు మంచాలు, చాపలు పరుపులు పక్క బట్టలు పాత సామాన్లు రెండు ట్రంకు పెట్టెలు ప్రతి వారి ఇంట్లోను ఉండేవి . మరికొన్ని సామాన్లు కలిగిన వారి ఇళ్ళల్లో మాత్రమే ఉండేవి. పందిరి మంచం, గోడ గడియారం, పడక్కుర్చీ గోడకి తగిలించే నిలువుటద్దం పెట్రోమాక్స్ లైటు గ్రాంఫోను ఇవన్ని గొప్ప స్టేటస్ సింబల్స్. ఎవరింటికైనా వియ్యాలవారో అల్లుడో వస్తే ఈ వస్తువులు అరువు అడిగి పట్టుకెళ్ళటం ఆనవాయితీ. సీదా సాదాగా ఐకమత్యంగా ఆనందంగా అమాయకంగా జీవనం సాగించే ఆ వూళ్ళో అనేకానేక మైన అనుభవాలు సంఘటనలు అవన్నీ ముందు ముందు ముచ్చటించుకుందాం. కనుమరుగు అయిపోయిన ఆ రోజులను మళ్ళీ గుర్తుచేసుకుందాం. ఆ మధురానుభూతులను మనసారా ఆస్వాదిద్దాం.

# పోస్ట్ చేసిన ఉత్తరం

**మా ఊళ్లో బాల్వాడీ స్కూల్ పెట్టారు కొత్తగా.** అప్పట్లో అది కొత్త కాన్సెప్ట్. చిన్న పిల్లలని బతిమాలి బుజ్జగించి బళ్లోకి తీసుకురావటం. వాళ్లకి ఆటపాటలతో చదువు చెప్పటం. ప్రభుత్వం వారు ఇచ్చిన పాలపొడితో పాలు కలిపి ఇవ్వటం, రవ్వతో మధ్యాహ్నం ఉప్మా చేసి పెట్టటం అంతా సందడిగా ఉండేది.

ఆ స్కూల్‌ని నిర్వహించే బాధ్యతా మా చిన్నమ్మమ్మది. ఆవిడే మా ఊరి మహిళా మండలికి వైస్ ప్రెసిడెంట్. ఊళ్లో అందరు ఆడవాళ్లల్లోకి ఆవిడే సమర్ధురాలు. ఆ రోజుల్లో పేపరు చదివి వార్తలు వినే ఏకైక నారీమణి మా ఊళ్లో ఆవిడే మంచి మనిషి.

కాస్త తొందరపాటు స్వభావం. కోపం వచ్చిందంటే గడ్డిమంటలాగా భగ్గున మండి చల్లారిపోతుంది.

బాల్వాడీ స్కూల్‌లో టీచర్లని ప్రభుత్వం వారే పోస్ట్ చేసారు. పనిమనిషిని ఎప్పాయింట్ చేసే బాధ్యత చిన్నమ్మమ్మకే అప్పగించారు. ఆవిడ తన పనిమనిషి సుబ్బరాములుని ఆ పోస్ట్‌లో వేయించింది. గవర్నమెంట్ ఉద్యోగం. నెలకి ఇరవై రూపాయలు జీతం. ఇక సుబ్బరాములుని పట్టతరం కాలేదు ఎవరికీ. మామూలుగానే మాట దురుసు సుబ్బరాములుకి. పని మాత్రం అద్భుతంగా చేసేది.

అదొక్కటే పదిమంది పెట్టు అని చెప్పుకునేవారు అందరూ. మా చిన్నమ్మమ్మ దగ్గర చాలా శ్రద్ధగా పనిచేసేది. ఉద్యోగం వచ్చాక ఆ విశ్వాసం కూడా తోడయింది. రాముల వారి దగ్గర ఆంజనేయ స్వామిలా ఉండేది. పొద్దున్నే వీళ్ళింట్లో పని చేసి స్కూల్‌కి వెళ్లిపోయేది సాయంత్రం రాగానే మళ్లీ పనికి వచ్చేది. అలా కొన్నాళ్లు బాగానే గడిచింది. స్కూల్లో పని ఎక్కువ అయిపోయి చిన్నమ్మమ్మా వాళ్లింట్లో పని దాటెయ్యటం మొదలు పెట్టింది. పప్పులు బాగు చెయ్యమనో బూజులు దులపమనో అదనంగా పనిచెపితే ‘రేపు చేస్తా.. ఎల్లుండి చేస్తా ‘ అని దాట వేయటం మొదలు పెట్టింది.

మా అమ్మకి కోపం వచ్చి కేకలేసేది. ‘ఇప్పుడేం కొంపలంటుకు పోతున్నాయి అమ్మగారూ రేపు చేస్తాగా ‘ అనేది సుబ్బరాములు.

ఆవిడకి మరింత కోపం వచ్చి వెంటనే నన్ను పిలిచి ‘ఓ తెల్లకాయితం పట్రా. బిడిఓ గారికి ఉత్తరం రాయాలి ‘ అని ఆర్డర్ వేసేది నేను వెంటనే రెడీ అయిపోయేదాన్ని. ఆవిడ చెపుతుంటే రాసేదాన్ని.

**గౌరవనీయులు బ్లాక్ డెవలప్ మెంట్ ఆఫీసరుగారి దివ్య సముఖమునకు,**

**యాజలి మహిళా మండలి వైసు ప్రెసిడెంటు సీతారావమ్మ రాయు అర్జీ,**

అయ్యా, మీరు స్థాపించిన బాల్వాడీ స్కూల్ చక్కగా నడుస్తూ ఉన్నది. కానీ అందులో పనిమనిషిగా ఉన్న సుబ్బరాములు చాలా నిర్లక్ష్యంగా ప్రవర్తించుచున్నది. చెప్పిన మాట వినకపోవుట ఎదురు సమాధానం చెప్పుట చాలా దూర్తంగా ఉన్నది ఆమె ప్రవర్తన. కావున మీ తక్షణము సుబ్బారాములని ఉద్యోగము నుండి తొలగించి దాని స్థానములో వేరొకరిని నియమించావలసినదిగా మనవి చేయుచున్నాను. ఈ విషయముపై వెంటనే చర్య తీసుకొనగలరు.

**ఇట్లు మీ విధేయురాలు.**

అని నాచేత రాయించి సంతకం పెట్టి కవర్లో పెట్టి అడ్రసు రాయించి వెళ్లు వెళ్లి ‘పసుపతిగారికి ఇచ్చిరా. హుటాహుటీ పంపించమని చెప్పు’ అని తరిమేది. నేను వెళ్లి ఆయనతో ఆ మాటే చెప్పేదాన్ని.

‘అర్జెంటుగా వెళ్లాలని నేను పరిగెత్తలేనుగా. ఇవ్వాళో రేపో వస్తాడు రంగడు. అప్పుడు పంపిస్తా ‘ అనేవారు పశుపతిగారు.

ఆ మర్నాడు సుబ్బరాములు అమ్మమ్మ దగ్గరికి వెళ్లి ఆవిడ చెప్పిన పనులన్నీ చిటికెలో చేసేసి అదనంగా ఇంకొన్ని పనులు కూడా చేసేసేది. ఇల్లూ వాకిలీ అద్దంలాగా చేసి పెట్టేది. ఆవిడకి కాళ్లకి నూనె రాసి మర్దనా చేసేది. అది అటు వెళ్లగానే నన్ను పిలిచేది అమ్మమ్మ.

'అమ్మడూ సుబ్బరాములు విషయంలో మనం తొందర పడ్డామేమో అనిపిస్తోందే!' అనేది. నేనేం చేసాను ఆవిడ రాయమన్నది రాసానంతే. ఆ మాటే చెప్పేదాన్ని. కాసేపు ఆలోచించేది. ‘అది ఓ వెర్రిమొద్దు. మాట కాస్త విసురుగానీ పని చక్కగా చేస్తుంది. ఉద్యోగం ఊడగొట్టి ఆ పాపం మూట కట్టుకోటం ఎందుకు? నువ్వెళ్లి ఆ ఉత్తరం వెళ్లిందేమో కనుక్కో. వెళ్లి ఉంటే దాని ఉద్యోగం ఉంచమని ఇంకోటి రాద్దాం. ఇక్కడే ఉంటే అడిగి ఇప్పించుకురా. ‘ అని తోలేది.

నేను వెళ్లేదాన్ని పశుపతిగారి ఎదుట నిలబడి ‘తాతయ్యగారూ మా అమ్మమ్మ బిడివో గారికి రాసిన ఉత్తరంట పంపించారా? ‘ అని అడిగేదాన్ని.

‘ఇంకా లేదు ‘ అనేవారు ఆయన. ‘ఆ ఉత్తరం తిరిగి ఇచ్చెయ్యమంది చిన్నమ్మమ్మ ‘ అని చెప్పేదాన్ని. ఆయన చిరాకు పడేవారు. ‘బొత్తిగా క్రమశిక్షణ లేకుండా పోతోంది. ఓ సారి పోస్టు చేసాక ఉత్తరం తిరిగి ఇవ్వటం రూల్సుకి విరుద్ధం. ఏమన్నా గట్టిగా అందామంటే అందరూ అయినవాళ్లే అయెనూ. సరే తీసుకెళ్లు ఈసారికి ఇస్తున్నా. ఇకమీదట ఇవ్వనని వదినకి గట్టిగా చెప్పు ‘ అని సణుక్కుంటూనే వెళ్లి ఆ ఉత్తరం తెచ్చి ఇచ్చేవారు. అది తీసుకెళ్లి అమ్మమ్మకి ఇస్తే ఆవిడ నా బుగ్గలు పుణికి ముద్దుపెట్టుకుని ఆ ఉత్తరం నీళ్లపొయ్యిలో పారేసేది.

*(మరో జ్ఞాపకం వచ్చేసంచికలో)*

Post your comments